
ఆత్మకూరు(ఎం) బ్రిలియంట్ పాఠశాలలో పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


భువనగిరి అర్బన్ : జీనియస్ పాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు


పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో భువనగిరిలో ఇంటికి బాట పడుతున్న విద్యార్థులు


రాజాపేట : పారుపల్లి జడ్పీ హైస్కూల్‌లో వేసిన ముగ్గులు

# పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాల్లోని పాఠశాలల్లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రంగులతో ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో తీర్చిదిద్దారు. హరిదాసుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అనంతరం పతంగులు ఎగురవేసి సందడి చేశారు. భోగి మంటలు వేశారు.


బీబీనగర్ : అన్నంపట్ల ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


ఆత్మకూరు(ఎం) బ్రిలియంట్ పాఠశాలలో హరిదాసుల వేషధారణలో విద్యార్థులు


తుర్కపల్లి : మండల కేంద్రంలోని పీఎంఎం పాఠశాలలో విద్యార్థినులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు


వలిగొండ : గాయత్రి పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


చౌటుప్పల్ : ట్రినిటీ స్కూల్‌లో భోగి మంటలు


మోత్కూరు సాయి చైతన్యలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

## మనువరాలు జన్మదిన వేడుకకు రండి

● కేటీఆర్‌కు కాసోజు శంకరమ్మ ఆహ్వానం

మోత్కూరు, జనవరి 11 : ఈ నెల 18న హైదరాబాద్‌లోని హయాత్‌నగర్ ఎస్‌వీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే తన మనువరాలు జన్మదిన వేడుకకు రావాలని కోరుతూ తెలంగాణ అమరుడు కాసోజు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించారు. గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే అక్కడే ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు,

మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయకర్‌రావును ఆహ్వానించారు

## పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

● ఆర్డీఓ సూర్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ

కోదాడ టౌన్, జనవరి 11 : అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. గురువారం తన కార్యాలయంలో రెవెన్యూ డివిజన్‌లోని తాసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. శాసన మండలి ఎన్నికలు ఉన్నందున పట్టభద్రులు ఫిబ్రవరి 6 వరకు ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. మండల కార్యాలయాల్లో ఓటు నమోదుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ సాయిగౌడ్, ఆంజనేయులు, హేమామాలిని, రవికుమార్, ఎంఈఓ సలీం షరీఫ్, ఎస్‌ఎల్‌ఎంటీ రమేశ్, డీఎల్‌ఎంటీ కోటయ్య పాల్గొన్నారు.

మద్దిరాల : పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తాసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. 1 నవంబర్ 2020 నాటికి డిగ్రీ పూర్తి చేసిన ఓటు నమోదుకు అర్హులని చెప్పారు. డిగ్రీ మెమో, ఆధార్, ఓటర్ కార్డుతో తాసీల్దార్ కార్యాలయంలో లేదా ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## ఆడ పిల్లలను ప్రోత్సహించాలి

రామన్నపేట, జనవరి11: ఆడపిల్లలను అన్ని రంగాల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సాహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత తెలిపారు. గురువారం బేటీ బచావో – బేటీ పడావో‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలల్లో పిల్లలు జన్మదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఆడ పిల్లలకు జన్మనిచ్చిన తల్లులను సన్మానించి వారికి మనోధైర్యం కల్పించారు. తల్లులకు చీరెలను, చిన్నారులకు గౌన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కోట ప్రవీణ, భార్గవి, మేడి లలిత, హేమలత పాల్గొన్నారు.


రామన్నపేట: ఆడపిల్లల తల్లిని సన్మానిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

## క్రీడా పోటీలు ప్రారంభం

మోత్కూరు, జనవరి 11: సంక్రాంతి సందర్భంగా మండలంలోని పాటిమట్లలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ స్థాయి క్రీడా పోటీలను నార్మాక్స్ మాజీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే క్రీడ పోటీలు ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచు మల్లేశ్, ఉపసర్పంచు కృష్ణాచారి, నాయకులు గిరగాని శ్రీనివాస్, ప్రభాకర్, బాలరాజు పాల్గొన్నారు.


మోత్కూరు : క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నార్మాక్స్ మాజీ డైరెక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి

## తండ్రిని చంపిన కొడుకుకు జీవిత ఖైదు

సూర్యాపేట లీగల్, జనవరి 11 : తండ్రిని చంపిన కొడుకుకు న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమాన విధించింది. కేసు వివరాలు.. పెన్‌పహాడ్ మండలం జమాల్‌కుంటతండాకు చెందిన నూనావత్ భిక్యా. ఈయనకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు పాండు, చిన్న కొడుకు స్వామి. అయితే తండ్రి భిక్యా తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో స్వామి 28 మార్చి 2020న మంచం చెక్కతో తలపై కొట్టడంతో తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. దాంతో పెద్ద కొడుకు పాండు ఫిర్యాదు మేరకు సూర్యాపేట రూరల్ అప్పటి సీఐ బి.విఠల్‌రెడ్డి కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో స్వామికి గురువారం సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ జీవితఖైదును విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ కె.లింగయ్య వాదనలు వినిపించారు.

# దళిత బంధు నిధులు విడుదల చేయాలి

● కలెక్టర్ హనుమంతు కే జెండగేకు దళిత సంఘాల నాయకుల వినతి

మోత్కూరు, జనవరి 11: దళిత బంధు రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్ల ఏర్పాటుకు నిధులను విడుదల చేయాలని కోరుతూ మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగేకు వినతి పత్రం అందజేశారు. వివిధ మండలాలకు చెందిన 254 మంది లబ్ధిదారులు కలెక్టర్‌ను గురువారం కలిశారు. గత ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి వారి బ్యాంకు ఖాతాల్లో రూ.3లక్షలను జమ చేసిందని, మిగిలిన రూ.7లక్షలను జమ చేసి యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం కోసం అనుమతిని ఇప్పించాలని కోరారు.


మోత్కూరు : కలెక్టర్ హనుమంతు కే జెండగేకు వినతి పత్రం అంద చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చిప్పలపల్లి మహేందర్‌నాథ్, దాసరి తిరుమలేశ్ ,రామచంద్రయ్యతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.



అడ్డగూడూరు : తాసీల్దార్ వినతిపత్రం అందజేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

అడ్డగూడూరు : దళితబంధు యూనిట్లను వెంటనే మంజూరు చేయాలని గురువారం లబ్ధిదారులు తాసీల్దార్ శేషగిరిరావుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళిత బంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. దళితబంధు పథకం దళితుల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో దళితబంధు లబ్ధిదారులు బాలెంల విద్యాసాగర్, పిల్లి గంగయ్య, సైదులు,లక్ష్మణ్, నరేశ్,అయోధ్య ఉన్నారు.

## అర్హులకు ప్రభుత్వ పథకాల అందజేతే లక్ష్యం

● సీనియర్ ఆర్థిక సలహాదారు ఆర్.కె.జెనా


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక సలహాదారు ఆర్.కె. జెనా

నేరేడుచర్ల, జనవరి 11 : దేశంలో నివసించే వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే వికసిత భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని సమాచార, ప్రసార శాఖ సీనియర్ ఆర్థిక సలహాదారు రవీంద్ర కుమార్ జెనా అన్నారు. గురువారం నేరేడుచర్ల జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, బ్యాంకు సేవలను ఉపయోగించుకుని ప్రతి ఒక్కరూ ఆర్థిక పరిపుష్టి చెందాలని సూచించారు. అనంతరం బ్యాంకులు అందించే సేవలు, డీఆర్డీఏ రుణాలు, పీఎం కిసాన్, పీఎం అవాస్ యోజన, ఆధునిక వ్యవసాయం, అధిక దిగుబడులపై పలువురు అధికారులు వివరించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ అధక్ష్యత జరిగిన ఈ సమావేశంలో ఎస్‌బీఐ మేనేజర్ ఫణికుమార్, డీపీఎంలు లక్ష్మీనారాయణ, రత్తయ్య, వైద్యాధికారి కళ్యాణ్, నాగిని, మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్ లలిత, గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ అశోక్, హెచ్‌ఎం బట్టు మధు పాల్గొన్నారు.

## పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీపీ సుజాత


మాట్లాడుతున్న ఎంపీపీ సుజాత

గరిడేపల్లి, జనవరి 11 : పోస్టాఫీస్‌లో కల్పిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెండెం సుజాతా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పింఛన్లు, ఉపాధి హామీ పథకం నగదు పంపిణీ, జీవిత బీమా, చిన్న మొత్తాల పొదుపు వంటి సౌకర్యాలు ప్రజలకు వరంలా మారాయన్నారు. తపాలా శాఖ సబ్ డివిజన్ అధికారి సందీప్ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధుల సహకారంతో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతారామ్‌రెడ్డి, ఎస్‌పీఎం డి.చందూలాల్, మెయిన్ ఓవర్‌సీస్ కోటయ్య, డాక్ సేవక్స్, గ్రామీణ ప్రాంతాల పోస్ట్ మాస్టర్లు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.


స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

## రామలింగేశ్వరుడికి లక్ష పుష్పార్చన

### భక్తులతో కిక్కిరిసిన చెర్వుగట్టు క్షేత్రం

నార్కట్‌పల్లి, జనవరి 11 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. గురువారం అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఓ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పించారు.

## కేంద్రం విధానాలతో ఉపాధి హామీ కూలీలకు నష్టం

● వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ధనుంజయనాయుడు

చిలుకూరు, జనవరి 11 : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈజీఎస్‌తో ఆధార్ అనుసంధానం వల్ల ఉపాధి హామీ కూలీలకు తీరని నష్టం జరుగుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం చిలుకూరులో జరిగిన వ్యవసాయ కార్మికుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు చెల్లింపులకు జాబ్ కార్డులు, ఆధార్, బ్యాంకు ఖాతాల అనుసంధానంతో చెల్లించడం వల్ల కోట్ల మంది కూలీలకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు.

బొడ్రాయిబజార్ : మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని చూస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు అన్నారు. స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

## బెల్ట్ షాపులు బంద్ చేస్తే రూ.లక్ష నజరాన

నేరేడుచర్ల, జనవరి 11 : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో నడుస్తున్న బెల్ట్ షాపులు పూర్తిగా బంద్ చేస్తే గ్రామాభివృద్ధికి రూ.1 లక్ష నజరాన ఇస్తానని కాంత్రినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ సుంకరి క్రాంతికుమార్ తెలిపారు. గురువారం నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో మద్యం విక్రయ కేంద్రాలు ఎక్కువగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలు, నేరాలు పెరిగిపోతున్నాయ న్నారు.గ్రామంలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు బెల్ట్ దుకణాలను తొలగించేందుకు కృషి చేయాలని కోరారు.

## పండుగ దృష్ట్యా రహదారిపై రక్షణ చర్యలు

● ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, జనవరి 11 : సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రా ప్రాంతానికి వెళ్లే వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది కావునా జిల్లా పరిధిలోని జాతీయ రహదారి 65పై రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ముందస్తుగా జిల్లా పోలీస్ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అత్యవసర సమయంలో రహదారుల అధికారులను, డయల్ 100కు ఫోన్ చేసి సాయం పొందాలన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి వెంట సూర్యాపేట రూరల్, చివ్వెంల, మునగాల, కోదాడ మండలాల పరిధిలో గల గ్రామాల రైతులు, ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కు కృతజ్ఞతలు

● తిరుమలగిరి మార్కెట్ చైర్‌పర్సన్ స్రవంతి

తిరుమలగిరి, జనవరి 11 : తిరుమలగిరి మార్కెట్ చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం ఇచ్చి ఇన్ని రోజులు అండగా నిలిచిన సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు కొమ్మినేని స్రవంతీసతీశ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సంవత్సర కాలంలో మార్కెట్ అభివృద్ధికి తాను ఎంతో కృషి చేసినట్లు తెలిపారు.

## 27న సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

బొడ్రాయిబజార్, జనవరి 11 : సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్‌పై ఈ 27న అవిశ్వాసం తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు. 27న ఉదయం చైర్‌పర్సన్‌పై, మధ్యాహ్నం వైస్ చైర్మన్‌పై తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు. ఈ మేరకు పాలక మండలి సభ్యులకు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పలువురు కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ ఈ నెల 10న కలెక్టర్‌కు విన్నవించిన సంగతి తెలిసిందే.

## 14న ముగ్గుల పోటీలు

చిలుకూరు, జనవరి 11 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ 14న సంక్రాంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిదు బహుమతులతో పాటు ప్రత్యేక బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సామాజిక తనిఖీ గ్రామ సభ

అర్వపల్లి, జనవరి 11 : మండలంలోని అడివెంలలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు గాను సామాజిక తనిఖీలో భాగంగా గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పనులను సభలో ప్రజలకు వివరించారు. ఇంటింటికీ తనిఖీ బృందం తిరిగి పనులపై ఆడిట్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.